ప్రజాశక్తి
శుక్రవారం 30 జూన్ 2023
5
అల్లూరి సీతారామరాజు

4 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొయ్యూరు

అక్రమంగా తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని మండలంలోని కాకరపాడు జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై రాజారావు తెలిపారు. గురువారం కాకరపాడు జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న వారిని తనిఖీ చేయగా, వారి వద్ద నాలుగు కేజీల గంజాయి పట్టుబడిందని చెప్పారు. గంజాయితో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి తరలిస్తున్న విజయవాడకు చెందిన ఆదిత్య, మనోజ్, జీకే వీధికి చెందిన వెంకట్రావును అరెస్టు చేశామని తెలిపారు.

పట్టుబడిన గంజాయి, నిందితులు

ప్రాజెక్టుకు, పునరావాసానికి

కేంద్రమే నిధులివ్వాలి

'పోలవరం పోరుకేక' ఉపయాత్రలో నేతలు

ప్రజాశక్తి - పోలవరం, బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పునరావాసానికి కేంద్ర ప్రభుత్వమే నిధులివ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' ఉపయాత్ర రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని కోండ్రుకోట పునరావాస కాలనీ నుండి ప్రారంభమైన యాత్ర ఎల్ఎన్‌డిపేట మీదుగా కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. కోండ్రుకోట పునరావాస గ్రామం, ఎల్ఎన్‌డి పేట గ్రామాల్లోని సెంటర్లలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన సభలు జరిగాయి ఈ సభల్లో శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసితులకు పునరావాసం కల్పించే చోటే 25 రకాల మౌలిక వసతులు కల్పించాలని 2013 భూ సేకరణ చట్టం చెబుతుందన్నారు. అయితే ఏ కాలనీలోనూ కనీస సౌకర్యాలు లేవన్నారు. కోండ్రుకోట పునరావాస గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడంతో గిరిజనులు చనిపోతే అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పునరావాసానికి అయ్యే మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, రాజ్యాంగం ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో యాత్రకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నేతలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పునరావాసానికి అయ్యే ఖర్చులో 20 శాతం నిధులు కూడా ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం తమకు సంబంధం లేదని మోడీ ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపికి, గతంలో అధికారంలో ఉన్న టిడిపికి ఎన్నికల్లో ఓట్లు అవసరం వచ్చినప్పుడు మాత్రమే నిర్వాసితులు గుర్తుకొస్తారన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు ప్రకటించాలని కోరారు. బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెం, నూతిరామన్నపాలెం, బొత్తప్పగూడెం, నందాపురం, కాపవరం, తూర్పు రేగులగుంట మీదుగా యాత్ర బుట్టాయిగూడెం చేరింది. ఆయా గ్రామాల్లో పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమాల్లో నేతలు బొరగం భూచంద్రరావు, మిడియం గంగాదేవి, ముచ్చిక చల్లాయమ్మ, మిడియం వెంకాయమ్మ, మిడియం పండు, మడివి చలపతి, తెల్లం వెంకటలక్ష్మి, సున్నం గంగమ్మ, మడకం సురమయ్య, తెల్లం వెంకటేశ్వర్లు, జలగం బులివెంకమ్మ, సవలం వీరమ్మ పాల్గొన్నారు.

200 కిలోమీటర్ల మైలురాయి దాటిన పాదయాత్ర

పోలవరం సమస్యలే పరిష్కరంగా ప్రధాన ఎజెండాగా సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్ర గురువారం 200 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. నెల్లిపాక నుంచి ఈ నెల పదో తేదీన ప్రారంభమైన పోలవరం పోరుకేక యాత్ర గురువారంతో పదో రోజుకు చేరుకుంది. బుట్టాయగూడెం మండలం రెడ్డి గణపవరంలో 200 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకోవడంతో స్థానిక గిరిజనులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. 200 కిలోమీటర్లు అక్షరాలతో ఆర్అండ్‌బి రహదారిపై అంకెలు వేసి స్వాగతం పలికారు. పాదయాత్ర బృందానికి హారతులిచ్చి బొట్టు పెట్టి అంతా అభినందనలు తెలిపారు.

'పోరుకేక'లో మేము సైతం

పాదయాత్రకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు

సాగుతున్న పోరుకేక పాదయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా కొనసాగుతున్న 'పోలవరం పోరుకేక' యాత్రకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు వెల్లువెత్తుతోంది. విజయవాడ, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, కాకినాడ వంటి దూరప్రాంతాల నుంచి సైతం ప్రజాసంఘాల నాయకులు తరలొచ్చి పాదయాత్రలో పాల్గొంటున్నారు. గురువారం జీలుగుమిల్లి మండలం కరుటూరు కాలనీలో ప్రారంభమైన యాత్ర ములగలంపల్లి, రౌతుగూడెం, రెడ్డిగణపవరం, పాలకుంటకాలనీ, రామారావుపేట, బుట్టాయగూడెం వరకు 17 కిలోమీటర్ల మేర సాగింది. పలుచోట్ల బహిరంగ సభలు జరగ్గా టిడిపి, జనసేన నాయకులు యాత్రకు సంఘీభావంగా కదలొచ్చారు. ములగలంపల్లి సభలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ మద్దతు ప్రకటిస్తూ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. బుట్టాయగూడెంలో జరిగిన సభలో జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు తమ పార్టీ తరపున మద్దతు ప్రకటించడంతో పాటు నిర్వాసితుల పట్ల వైసిపి వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 20న నెల్లిపాకలో ప్రారంభమైన పాదయాత్ర పదోరోజు గురువారం రెడ్డిగణపవరం చేరేసరికి 200 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. దీంతో పెద్దఎత్తున గ్రామాల జనం కదిలివచ్చి హారతులు పట్టి స్వాగతించారు. ఈ పాదయాత్రకు ఆశావర్కర్ యూనియన్‌తో పాటు ఐద్వా, గిరిజన సంఘాలు, విశాఖ స్టీల్‌ప్లాంటు యూనియన్ నాయకులు, పశ్చిమగోదావరి సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.

ఆయుధ కర్మాగారంతో దెబ్బతీయాలని చూస్తున్నారు

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటు ద్వారా రెండు పంచాయతీలను ఖాళీ చేయించాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. అదానీ, అంబానీల కోసం ప్రజలను బలి చేయాలని చూస్తున్నారన్నారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తునందన్నారు. ఈ గ్రామాలకు వచ్చిన నిర్వాసితులకు, స్థానికుల మధ్య గొడవలు పెడుతుందన్నారు. జల్లేరు ప్రాజెక్టు పేరులో మరికొన్ని గ్రామాలను ముంచాలని చూస్తుందన్నారు. అంతా నిర్వాసితులకు అండగా ఉండాలని, కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, విఆర్‌పురం ఎంపిపి కారం లక్ష్మి, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్నకుమార్, సిపిఎం జిల్లా నేతలు మొడియం నాగమణి, పి.మంగరాజు, కె.శ్రీనివాస్, వెంకట్రావు, ముత్యాలమ్మ, బుల్లమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, ఆర్.లింగరాజు, డివిఎడి.ప్రసాద్, పి.కిషోర్ పాల్గొనగా సభలకు మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు.

రెడ్డి గణపవరంలో జనసేన స్వాగతం

బుట్టాయగూడెం మండలంలోని రెడ్డి గణపవరం చేరుకున్న పాదయాత్రకు జనసేన మండల అధ్యక్షులు తెల్లం రవిప్రకాష్, గురజాల వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, వెంకటవరప్రసాద్, సురేష్‌బాబు, కూనం రాజా, తెల్లం పున్నయ్య, ముత్యాలరావు, జోగిరాజు, సురేష్ తదితరులు పెద్దఎత్తున స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

హాజరైన నిర్వాసితులు

మాన్సాస్ ట్రస్ట్ భూములపై

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

అడ్డుకుంటామంటున్న గిరిజన సాగు రైతులు

అనంతగిరిలో గిరిజన రైతుల సాగులో ఉన్న మాన్సాస్ ట్రస్ట్ భూములు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని అనంతగిరి, టోకూరు, కొండిభ, ఎగువశోభ పంచాయతీల పరిధిలోని ఎనిమిది గ్రామాల పరిధిలోని విజయనగరం మహారాజుల మాన్సాస్ ట్రస్ట్ భూముల వ్యవహారంపై ఈ నెల 30న శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాంబాయి తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు తాహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు ఎంపిపి, జెడ్‌పిటిసితోపాటు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అనంతగిరి, మొండి జాముగుడ, హెక్టగుడ, కొత్తవలస, ములియగుడ, రాయవలస, డముకు, మువంలస ఎనిమిది గ్రామాల రైతులు, మాన్సాస్ ట్రస్ట్ ప్రతినిధులు సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తాహశీల్దార్ రాంబాయి తెలిపారు. అరకు రోడ్డు ఇరువైపులా అప్పట్లో రాజులు పనస, ఇతర పండ్ల తోటలు ఉండేవని, రాజుల వదిలి వెళ్లిన తర్వాత ఈ భూములు గిరిజనుల సాగులో ఉన్నాయన్నారు.దీనిపై ఇరుపక్షాల అభిప్రాయాలను సేకరించి, తదుపరి చర్యలకు ఐటిడిఎ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహశీల్దార్ వెల్లడించారు.

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం : రైతులు

రైతుల సాగులో ఉన్న భూములను లాక్కొనేందుకే నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని రైతులు సోమ్మెల ఆనంద్, గెమ్మెల. రాజు, మహేష్, పి. కొండలరావు, జి.పెంటన్న తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం రాజులు అప్పట్లో భూములు వదిలి వెళ్లిన తర్వాత నాటి నుంచి నేటివరకు దాదాపు వంద ఎకరాల భూములను 30మంది రైతులు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల సమగ్ర భూసర్వే తర్వాత గిరిజనుల సాగులో ఉన్న భూములను తీసుకుని, వారి జీవనోపాధిని హరించేందుకు మాన్సాస్ ట్రస్ట్‌గానీ, అధికారులు గానీ పూనుకుంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. భూముల జోలికి వస్తే తరిమి కొడతామని హెచ్చరించారు. కాగా గత నెలలో ములియగుడ భూములను రహస్యంగా సర్వేచేయాలని చూస్తే అడ్డుకుని వెనక్కు పంపామన్నారు. గిరిజన రైతుల సాగులో ఉన్న భూములను గుర్తించి, సాగుహక్కు పట్టాలు ఇవ్వాలని కోరారు. రైతులందరూ హాజరై ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిద్దామన్నారు.

పివిఎస్ఎన్ఎం.రాజును సత్కరిస్తున్న దృశ్యం

నిబద్ధత కలిగిన వ్యక్తి రాజు

రిటైర్‌మెంట్ సభలో యూనియన్ బ్యాంకు డిజిఎం నరేష్

ప్రజాశక్తి-పాడేరు

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయిన పివిఎస్ఎన్ఎం.రాజు నిబద్ధత కలిగిన వ్యక్తి అని ఆ బ్యాంకు విజయనగరం రీజియన్ డిజిఎం నరేష్ అన్నారు. రాజు రిటైర్మెంట్ ఫంక్షన్ స్థానిక మాధవాంబ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిజిఎం నరేష్ మాట్లాడుతూ రాజు సేవలు అమోఘమని, ఒకటి రెండు సార్లు ఆయన సేవల గురించి విన్నానని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. బ్యాంకు పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. విజయనగరం రీజియన్ ఆఫీసర్స్ యూనియన్ సెక్రటరీ ఆడారి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజు క్రమశిక్షణతో చేసే పనిని చూసి తాము చాలా నేర్చుకున్నామని చెప్పారు. ఎవరైనా ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అనగా వెనుకడుగు వేసేవారని, కాని రాజు తనే ముందుకొచ్చి బ్యాంకు అభివృద్ధికి ఎంత కృషి చేశారని తెలిపారు. ఎల్డీఎం రవితేజ, బ్యాంకు మేనేజర్ ఎల్ భానుచందర్, సిసి ఆఫీస్ నుంచి, ఐటిడిఏ పిఓ ఆఫీస్ నుంచి సంబంధిత అధికారులు, బ్యాంకు సిబ్బంది మేనేజర్ రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మన్యంలో బక్రీదు పండుగ ముస్లిములు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రెహమాన్యా మసీదు మండల ముస్లిం సోదరులు ప్రపంచ మానవాళి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షులు యూసఫ్ బాజీ, ముతవల్లి మహమ్మద్ అలీ, ఉపాధ్యక్షులు దావుద్, సుల్తాన్, కార్యదర్శులు సినీ పకీర్, లతీఫ్, సత్తార్, రెహమాన్, మసీద్ గురువు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలో పాల్గొన్న ముస్లిములు

వారం రోజులకే వర్షార్పణం..!

- ముందుచూపు లేని పనులతో పాడైన రోడ్డు
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అధ్వానం
- సిపిఎం ఆధ్వర్యంలో ఘాటీ వద్ద ఆందోళన

రంగబయలు, జోడిగుమ్మ వద్ద కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : శాశ్వతంగా పదికాలాల పాటు ఉండాల్సిన పక్కా రోడ్డు వారం రోజులకే వర్షార్పణం కావడంపై గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్, పర్యవేక్షణ లేని అధికారుల నిర్లక్ష్యంతోపాటు కనీసం ముందుచూపు లేకుండా ఘాట్‌రోడ్డులో చేపట్టిన నాసిరకపు పనుల వల్ల మొదటి వర్షానికే రోడ్డంతా కొట్టుకుపోయిందని గిరిజనం వాపోతున్నారు. కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, అయినా ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడుతున్నారు. ఈమేరకు గురువారం ధ్వంసమైన రోడ్డు పరిశీలనకు వెళ్లిన సిపిఎం నేతల బృందం అక్కడ ఆందోళన చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు చేపట్టి, రోడ్డుకయ్యే వ్యయాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివరాలివి.

ముంచింగిపుట్టు మండలంలో మారుమూల రంగబయలు పంచాయితీలో వనుగుమ్మ నుంచి జోడిగుమ్మ వరకు రూ.17 కోట్ల ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం 22కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేపట్టి, వారం రోజుల క్రితమే పూర్తి చేశారు. అయితే నిర్మాణ పనుల సమయంలో తగు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, ఘాట్‌రోడ్డులో పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలు తీసుకోకపోవడం వంటి కారణాలతో రెండు వర్షాలతో ఘాట్ మార్గంలో రోడ్డంతా కోతకు గురైంది.

వారం రోజులకే కోట్ల రుపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు పాడైన సమాచారం తెలుసుకున్న సిపిఎం బృందం గురువారం అక్కడకు వెళ్లి పరిశీలన జరిపింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కొర్ర త్రినాధ్, మండల వైస్ ఎంపిపి పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఘాట్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలను అధికారులు, కాంట్రాక్టర్లు గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఘాట్‌రోడ్డు మలుపుల్లో తారురోడ్డు వేస్తే ఎంతో కాలం నిలవదని తెలిసి కూడా సిమెంట్ కాంక్రీటు రోడ్డు వేయకుండా తారురోడ్డు నిర్మాణం చేపట్టడం, అంతేకాక మలుపుల వద్ద రోడ్డు నిర్మాణంలో మట్టి, గ్రావెల్‌వేసి నీరుపోసి సక్రమంగా రోలింగ్ చేయకుండానే తారురోడ్డు లేయర్‌ను ఆదరాబాదరాగా వేసి చేతులు దులుపుకోవడం వల్ల తొలి రెండు వర్షాలకే రోడ్డు పాక్షికంగా కోతకు గురైందని ఆరోపిస్తున్నారు. పనుల నిర్మాణం సమయంలోనే సిపిఎం ఆధ్వర్యంలో అధికారులు, కాంట్రాక్టర్లకు ఘాట్‌రోడ్డు వద్ద రహదారి పనులు పటిష్టంగా చేపట్టాలని మొరపెట్టుకున్నా, వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ దుస్థితి నెలకొందని అంటున్నారు. దీనికి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను బాధ్యులను చేస్తూ తగు చర్యలు చేపట్టాలని, మిగతా రోడ్డు పూర్తిగా పాడవ్వకముందే తగు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. అధికారుల స్పందించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.భీమరాజు, ఎంఎం శ్రీను, కె.శంకర్రావు, ఎస్.దొన్నో, కె.నర్సయ్య, కే.కొండయ్య, కే.విక్రమ్, ఎన్. సాడ్డురం, ఎస్.చండల్, ఎస్.సంతన్న పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనుల ఆందోళన

టమోటా కిలో @ రూ.100

- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- మండిపోతున్న ఇతర కూరగాయల ధరలు
- సామాన్యులకు పచ్చడి మెతుకులే శరణ్యం

ప్రజాశక్తి -పాడేరు: ప్రతి ఇంట్లో ఏ కూర వండినా, టమాటో తప్పనిసరిగా ఉండాల్సిందే! టమోటా వేయనిదే ఏ కూర రుచించదు. కూరల్లోనే కాదు అనేక వంటకాల్లో ఈ టమోటా మిళితమౌతుంది. మార్కెట్లో మాత్రం చౌక ధరకే లభించే ఈ టమోటాలకు ఇప్పుడు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మార్కెట్లో టమోటా కిలో ధర రూ.100కు పెరిగింది. సాధారణంగా మార్కెట్లో కిలో రూ.పదికి దొరికే టమోటా పళ్ళ ధర పదింతలు పెరిగిపోయింది. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో టమాటా పళ్ళకు మంచి గిరాకీ ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్లో ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు కాస్త ఎక్కువగానే ఉన్నాయి. ఇటీవల కాలంలో మార్కెట్లో ఏదో ఒక కూరగాయ ధర ఎక్కువగా ఉంటూ వస్తోంది. మార్కెట్లో నిరంతరం డిమాండ్ ఉండే కూరగాయలు కొరతతో ఈ ధరలు అదుపు తప్పుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మార్కెట్లో ఉండే డిమాండ్‌ను బట్టి వ్యాపారులు రేటు పెంచేస్తున్నారు. వినియోగదారులు నచ్చితే కొనుక్కోవడం లేదంటే మిన్న కుండడం తప్ప ప్రశ్నించలేని పరిస్థితి ఉంది. వినియోగదారులు ఏ పూటకా పూట కొనుక్కునే కూరగాయలు ధరలు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితిపై బేజారుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పచ్చిమిరప కిలో రూ.120, మునగ కాడలు కిలో రూ.300 చొప్పున ధర అధికంగానే ఉంది. మొన్నటి వరకు ఘాటెక్కిన అల్లం ధర కాస్త దిగి వచ్చింది. ఏజెన్సీలో ప్రస్తుతం అల్లం దిగుబడి వస్తుండడంతో సంతల్లో వ్యాపారులు రైతుల నుంచి అల్లం హైబ్రిడ్ రకం కిలో రూ.150లకు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో మండిపోతున్న కూరగాయల ధరలతో సామాన్యుల ఇంట్లో పచ్చడి మెతుకులే శరణ్యమౌతోందని పలువురు వాపోతున్నారు.

చెత్తమయంగా షాపింగ్ కాంప్లెక్స్

పట్టించుకోని పంచాయతీ, ఐటిడిఎ

దుర్వాసనతో జనం ఇబ్బందులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండల కేంద్రంలో గిరిజన మ్యూజియం ఎదురుగా నిర్మించిన ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్ చెత్తాచెదరాలతో అధ్వానంగా తయారైంది..పార్కింగ్ స్థలం ,దుకాణాలకు ఎదురుగా చెత్తాచెదారాలను ఇష్టారాజ్యంగా వేస్తుండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అవి కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతూ అక్కడి వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయినా గ్రామపంచాయతీగానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని దుకాణదారులు చెపుతున్నారు.వాహనాలు పార్కింగ్ కోసం అధికారులు నిర్మించిన పార్కింగ్ స్థలమంతా నీరు నిల్వ ఉండి, దోమలకు ఆవాసంగా మారడంతోపాటు అక్కడి దుకాణదారులు, కొనుగోలుదారులకు అవస్థలు పాల్జేస్తోందని అంటున్నారు. వాణిజ్య సముదాయము చెత్తచెదారం, నీటి నిల్వలతో నిండి,అధ్వానంగా తయారైందని. వాహనాల పార్కింగ్ ప్లాట్‌ఫారం నిర్వహణ బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసం దీన్ని బాగుచేసే పరిస్థితి లేకపోవడంతో డంపింగ్ ప్రదేశంగా మారిందని, పశువులు నివాసంగా మారడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులుగానీ, గ్రామపంచాయతీ గాని తక్షణమే స్పందించి, పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

డంపింగ్ యార్డులా పార్కింగ్ స్థలం

రైతు సంఘం నేత గృహ నిర్బంధం

ప్రజాశక్తి ఎస్ రాయవరం : ఈనెల 30న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పల రాజును గృహ నిర్బంధం చేశారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో అతని స్వగృహంలో పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ తీవ్రమైన సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి, కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టే ధర్నాకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ఆందోళనకు పిలుపునిస్తే వెళ్ల కుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని, విజయవాడలో రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నాను విజయవంతంగా జరుగుతుందన్నారు.

2న యాదవ ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : యాదవ కులంలో పుట్టి పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో విశేష ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు వచ్చేనెల 2న అనకాపల్లిలో యాదవ సంఘ ఆధ్వర్యంలో జిల్లాసంఘం ద్వారా పురస్కారాలతో పాటు ప్రోత్సాహకాలను అందించనున్నట్లు విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు భరణికాన బాబూరావు తెలిపారు.. గురువారం యస్ రాయవరం మండలం కోనవానిపాలెంలో యాదవ సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యాదవ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతిభావంతులను గుర్తించేందుకు పర్యటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు భరణికాన నర్సింహమూర్తి, ధూళి రంగనాయకులు, వియ్యపు సింహాచలం, కోరాడ శ్రీను, పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు కోన అప్పలరాజు, నక్కపల్లి మాజీ జెడ్‌పిటిసి కురందాసు నూకరాజు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, ధూళి శ్రీను, వియ్యపు వరహాలు, దారబోయిన సత్యన్నారాయణ, బొట్టా వరహాలు, బొట్టా రాంబాబు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ఆడారి కృషి అభినందనీయం

ప్రజాశక్తి - మాడుగుల : పాడిరైతులు, ప్రజల సంక్షేమానికి విశాఖ డెయిరీ పూర్వ చైర్మన్ ఆడారి తులసీరావు బాటలోనే అతని తనయుడు ప్రస్తుతం చైర్మన్ ఆనందకుమార్ కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని వంటర్లపాలెం గ్రామంలో విశాఖ డెయిరీ నిధులు రూ.4.5 లక్షలతో నిర్మించిన నూతన పాలఉత్పత్తిదారుల సంఘ భవనాన్ని ఆనందకుమార్‌తో కలిసి ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పార్టీ రైతుల జీవనోపాధికి విశాఖ డెయిరీ ఎంతో కృషి చేస్తోందన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ పాడి రైతుల పట్ల ప్రేమ, నిబద్ధత స్వర్గీయ తులసిరావుకు ఉండేవని, తన తండ్రి స్ఫూర్తితో డెయిరీ అభివృద్ధికి, సభ్య రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి నేతలు పాల్గొన్నారు

తీర ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి :వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎపిఐఐసి తీర ప్రాంతాల్లో సేకరించిన భూములను అధికారులు పరిశీలించారు. తీర ప్రాంత గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు తదితర ప్రాంతాల్లో ఎపిఐఐసి అధికారులు కిషోర్, పద్మజ, దేవి, ఆర్‌డిఒ జయరాం , ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ప్రతినిధులు పర్యటించారు. భూమి ఎంత సేకరించారు తదితర అంశాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే వాటిని చెల్లిస్తామని అధికారులు తెలిపారు..

కూరగాయల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి- మాడుగుల : అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో సామాన్యులకు చుక్కలు కనబడుతున్నాయి. నిన్న,మొన్నటి వరకు కోడి మాంసం ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా అమాంతం పెరగగా, ఇప్పుడు కూరగాయల పరిస్థితి కూడా అలాగే తయారైంది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.20లకే దొరకే టమోటా ఏకంగా ఐదింతలు పెరిగి రూ.100 కు చేరింది. పచ్చి మిర్చి ఘాటెక్కి ఎపుడో రూ.100 దాటేసింది. ఇక అల్లం, వెల్లుల్లి ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేనంతగా పెరిగాయి. బీన్స్, బీర, కాకర, తదితర కూరగాయలు ధరలు రూ.80 నుండి రూ.100 కు చేరాయి. ఇతర అనేక రకాల కూరగాయల ధరలు పెరిగాయి. స్థానికంగా లభించే బెండ, వంకాయ, దొండ వంటి రకాలతో పాటు, బంగాళా దుంపల ధరలు మాత్రం కాస్త అందుబాటులో వున్నాయి. ఆకు కూరలు ధరలు సైతం అమాంతంగా పెరిగాయి. నెల రోజులు ముందు కోడి మాంసం ధర కూడా అమాంతంగా పెరిగింది కిలో 300 దాటడం అనేక సంవత్సరాల తరువాత ఇదే మొదటి సారి. ప్రస్తుతం చికెన్ ధరలు కాస్త తగ్గినప్పటికీ, కూరగాయల ధరలు మాత్రం ఆకాశాన్నంటాయి. జూన్ మొదటి వారంలో ఎండలు ఎక్కువగా కాయడం, వర్షాలు లేకపోవడం తదితర కారణాలతో ధరలు పెరిగినట్టు వ్యాపారులు చెపుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను గురువారం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు పాలూరి నర్సింగరావు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

4న మహాధర్నాకు తరలిరావాలి

ప్రజాశక్తి - విఆర్.పురం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై జులై 4న విజయవాడలో జరిగే మహాధర్నాకు ఇంటికో మనిషి ఊరుకో బండితో కదలివచ్చి విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని జీడిగొప్ప గ్రామంలో వంకు సత్తిబాబు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 2022లో వచ్చిన వరదలకు మునిగిపోయిన గ్రామాలన్నింటికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కటాఫ్ డే నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని కోరారు. 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు ఒక్కొక్క గ్రామంలో 10-20 కుటుంబాలకు డబ్బులు ఇవ్వలేదని, అందరికీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కమ్మచ్చిచ్చు సత్యనారాయణ, సీరపు తాతబాబు, కొండారెడ్డి, ఖాదర్ బిక్షమ్ తదితరులు పాల్గొన్నారు.

సంతను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బాలరేవుల వారపు సంత ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి బాలరేవుల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వారపు సంతను గురువారం ఎంపీపీ బడుగు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలరేవుల గ్రామంలో వారపు సంత ఏర్పాటు చేయడం వల్ల సుమారు 20 గిరిజన గ్రామాలకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. ప్రతి గురువారం బాలరేవులలో వారపు సంత జరుగుతుందన్నారు. ఈ సంతకు వచ్చే వ్యాపారులు, పరిసర గ్రామ ప్రాంత గిరిజనులు సహకరించాలని కోరారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - కొయ్యూరు : జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య ఆదేశించారు. గురువారం ఆయన ఇఒపిఆర్‌డి ఆర్‌పి.నాయుడుతో కలిసి మండలంలోని డౌనూరు, చిట్టెంపాడు గ్రామ సచివాలయాలను సందర్శించారు. జగనన్న సురక్ష పథకం అమలు జరుగుతున్న తీరును సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సురక్ష పథకం ద్వారా ప్రజలందరి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

శిథిలావస్థలో రాజుపేట రహదారి

- క్వారీ లారీలతో రోడ్డు అధ్వానం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకునే నాధుడే కరువు

నీరు నిండిన గోతులతో రాజుపేట రహదారి

ప్రజాశక్తి -కోటవురట్ల: రాజుపేట రహదారి అధ్వానంగా తయారవడంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నా గడిచిన నాలుగేళ్లుగా కనీసం పట్టించుకునే నాధుడు లేడని గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని నల్ల పిక్క క్వారీ నుంచి రేయింబవళ్లు తేడా లేకుండా భారీ వాహనాలు నిత్యం పరిమితికి మించి అధిక లోడుతో ప్రయాణించడం ప్రధానరహదారి శిథిలావస్థకు కారణమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో నిత్యం దుమ్ముధూళి రేగి, ఇబ్బంది పడుతున్నామని, ఏక్షణాన ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో ఉందని పలువురు అంటున్నారు.

మండలం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి శిథిలావస్థకు చేరుకోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు ం చోటుచేసుకున్న ఘటనలున్నాయి, పి రామన్నపాలెం, జంగాలపల్లి, రాజుపేట, కైలాస పట్నం వెళ్లే వరకు ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది, ఇటు అధికారులు గానీ, అటు నాయకులు గానీ కనీసం రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదని ఈ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ లోడుతో నిత్యం రాకపోకలు సాగిస్తున్న క్వారీ లారీలను ఈ మార్గంలో నియంత్రించాలని, పాడైన రోడ్డును పునర్నిర్మించి, ప్రజల రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

హైకోర్టు స్టేపై కౌంటరు దాఖలు చేస్తాం

15వ వార్డు కౌన్సిలర్, న్యాయవాది బుల్లిదొర

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణకు భవన యజమానులకు ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చినందున, కోర్టు ఉత్తర్వుల మేరకు నడుచుకుని తదుపరి చర్యలు చేపడతామనినర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కనకారావు తెలిపారు. విస్తరణ నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కనకారావు, 15వ వార్డు కౌన్సిలర్, న్యాయవాది మాకిరెడ్డి బుల్లి దొర వేర్వేరుగా స్పందించారు.

కమిషనర్ కనకారావు మాట్లాడుతూ, కోర్టు ఆదేశాలను గౌరవిస్తామన్నారుఉ. కౌన్సిలర్, న్యాయవాది మాకిరెడ్డి బుల్లి దొర మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భవన యజమానులకు ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే, దీనిపై కౌంటర్ దాఖలు చేస్తామని బుల్లిదొర తెలిపారు. మున్సిపాలిటీ, నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వంద అడుగులకు రోడ్డు విస్తరణ చేపట్టాలని కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయంగా గత ఏడాది డిసెంబర్లో రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేసి, నిధులు మంజూరు చేశారన్నారు. విస్తరణకు సంబంధించి భవన యజమానులకు జారీ చేసిన నోటీసులపై మాత్రమే హైకోర్టు స్టే ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ ప్రక్రియ ఆపాలని కోర్టు ఎక్కడా ఆదేశించలేదన్నారు. కోర్టు ఆదేశాలను గౌరవించి వారం రోజుల్లో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

జగనన్న సురక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌డిఒ జయరాం అన్నారు .మండలంలోని కాగిత సచివాలయాన్ని సందర్శించారు. వచ్చేనెల ఒకటి నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్షపై అధికారులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కన్వీనర్లతో సమీక్షించారు. ఇంటింటా సర్వే, టోకెన్లు, సర్వీసెస్, సర్టిఫికెట్లు తదితర అంశాలపై వివరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు.

వేంపాడు సచివాలయాన్ని ఎంపిడిఒ సీతారామరాజు సందర్శించారు.

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయాలని ఆర్‌డిఒ వెంకట జయరాం సిబ్బందికి సూచించారు, గురువారం చౌడువాడ సచివాలయంలో జగనన్న సురక్ష పనితీరును పరిశీలించారు. మండలంలో సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ,కోటవురట్లలో రెండు సచివాలయాలు, రాజుపేట, చౌడువాడ, సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించగా గురువారం నుండి పందూరు గ్రామంలో దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు, కోటవురట్ల రెండు సచివాలయాల్లో 330, రాజుపేట 125, చౌడువాడ 140, పందూరు 4 మంది వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాహాశీల్దారు జానకమ్మ

రీసైకిల్ సెంటర్‌ను సందర్శించిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి -మధురవాడ : అభివృద్ధి, పర్యావరణ నియంత్రణ కోసం రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలోని ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి తదితర ప్రాంతాలలోని పలు త్రిబుల్ ఆర్ సెంటర్లను పరిశీలించారు.

కన్నబాబురాజు వ్యూహంలో చిక్కిన బొడ్డేడ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పించి, ఆ స్థానాన్ని గవర కార్పొరేషన్ ఛైర్మన్, మంత్రి అమర్‌నాథ్ అనుచరునిగా ప్రచారం పొందుతున్న బొడ్డేడ ప్రసాద్‌తో భర్తీచేయడం వెనుక రాజకీయ వ్యూహంలేకపోలేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంపై కేంద్రీకరించి పనిచేయాలనన్న ఆలోచనతో తనను అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరినట్లు ధర్మశ్రీ చెబుతున్న మాటల్లో నిజమెంతో తెలీదుగానీ, యలమంచిలి నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో బొడ్డేడ బెడద లేకుండా చేసుకోవాలన్న యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) వ్యూహం ఫలించినట్లు బలమైన ప్రచారం సాగుతోంది. కన్నబాబు రాజుతో సఖ్యతగా వున్నట్లు బయటకు కన్పిస్తున్నా... వచ్చే ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఆలోచనతో బొడ్డేడ తన ప్రయత్నాలు గట్టిగా చేస్తూనేవున్నారు. మంత్రి అమర్‌నాథ్‌కు ప్రసాద్ కొంతకాలంగా సన్నిహితునిగా మెలుగుతున్నారు. యలమంచిలి నియోజకవర్గ పరిధిలోని కొన్ని భూ వ్యవహారాల్లో అమర్‌నాథ్, ప్రసాద్ జోక్యం పెరగడంతో సిఎం దగ్గర కొన్ని రోజుల క్రితం పంచాయితీ జరిగినట్లు తెలిసింది.

యలమంచిలి నియోజకవర్గంలో బయట నుంచి జోక్యం లేకుండా, ఎవరిపని వాళ్లు చేసుకోవాలని సిఎం చెప్పినట్లు తెలిసింది. తాను పోటీ చేయాలన్న ఆలోచనలోవున్న బొడ్డేడ నియోజకవర్గంలో తన పట్టు పెంచుకొనే ప్రయత్నాలు ఆపలేదు. మంత్రి అమర్‌నాథ్ సలహాతో నియోజకవర్గంలో బొడ్డేడ గ్రూపులు నడుపుతున్నారని పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ రీత్యా అంతర్గత స్పర్థలు కన్నబాబురాజు, అమర్‌నాథ్ మధ్య పెరుగుతున్నాయి. ఈ సమయంలో జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలన్న ధర్మశ్రీ నిర్ణయం కన్నబాబురాజుకు కలిసొచ్చింది. నియోజకవర్గంలో పెరుగుతున్న అసంతృప్తిని ఎన్నికల నాటికి తగ్గించుకోవాలన్న యోచనలో ధర్మశ్రీ వున్నారు. దీంతో ఆయన తన నియోజకవర్గానికి పరిమితంకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎమ్మెల్యేలకు జిల్లా పార్టీ వ్యవహారాలు అప్పగించే అవకాశం లేకపోవడంతో.. బొడ్డేడకు పార్టీ బాధ్యతలు అప్పగించి తలనొప్పి తగ్గించుకోవాలని కన్నబాబురాజు వ్యూహం పన్నారు. నియోజకవర్గంలో కేంద్రీకరించి పనిచేసే అవకాశం లేకుండా పార్టీ బాధ్యతలను ఆయనకు అప్పగించేలా చేశారని ప్రచారం సాగుతోంది. పార్టీ బాధ్యతలు అప్పగించి యలమంచిలి నుంచి పోటీ చేసే ఆలోచన లేకుండా బొడ్డేడకు సంకేతాలిచ్చినట్లు తెలిసింది. జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దగలిగే సామర్థ్యం బొడ్డేడకు వుందా ? లేదా ? అనేది పక్కనబెడితే ఆయన నుంచి తలపోటు లేకుండా కన్నబాబురాజుకు చేసుకోగలిగారన్న చర్చ ఆ పార్టీలో వుంది. అయితే జిల్లా వైసిపి అధ్యక్షునిగా గతం కంటే జోక్యం పెంచుకోవచ్చని బొడ్డేడ అనుచరులు భావిస్తున్నారు.

అధ్యక్ష బాధ్యతలతో సరిపెట్టుకోవాలని సంకేతం
తలపోటు తప్పినట్లు ఎమ్మెల్యే అనుచరుల భావన

చెత్త పన్ను వసూలు బాధ్యత నుంచి తప్పించాలని..

పర్యావరణ కార్యదర్శుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ వార్డు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న సుమారు 3500 మందికిపైగా వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు చెత్త పన్ను వసూలు బాధ్యత అప్పగించారని, ఆ బాధ్యత నుంచి తప్పించాలని, తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 423ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పలువురు పర్యావరణ కార్యదర్శులు ధర్నా చేపట్టారు. 423 జిఒ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ విశాఖపట్నం అధ్యక్షులు పి.పార్థసారథి, కార్యదర్శి డబ్ల్యు.పీటర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆడారి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ చెత్త పన్ను, యూజర్ ఛార్జీలు వసూలు విషయంలో అధికారులు లక్ష్యాలు విధించి వేధిస్తున్నారని తెలిపారు. మిగతా సచివాలయ సిబ్బంది వలే తమకు కూడా ఒక పని సమయాన్ని నిర్ణయించాలన్నారు. చెత్త పన్ను వసూలు చేయలేదని 12 మందిపై సస్పెన్షన్ వేటు వేశారని, తక్షణమే దాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 45 నెలలుగా శానిటేషన్ కార్యదర్శులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ప్రతిరోజూ తెల్లవారుజామున ఐదు గంటలకే సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తూ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని వాపోయారు.

ధర్నా చేస్తున్న పర్యావరణ కార్యదర్శులు

రాష్ట్ర ప్రజల క్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రజల క్షేమమే టిడిపి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ అన్నారు. చంద్రబాబు ప్రారంభించిన భవిష్యత్తుకి గ్యారెంటీ బస్సు యాత్రలో భాగంగా గురువారం దక్షిణ నియోజకవర్గంలో బస్సుయాత్రను నిర్వహించారు. ముందుగా జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. అక్కడి నుంచి వైసిపి ప్రభుత్వం మూసివేసిన సెయింట్ పీటర్ ఎయిడెడ్ పాఠశాల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు. అక్కడి నుండి చెత్త పేరుకుపోయిన ఎర్రి గెడ్డ వద్దకు వెళ్లి సెల్ఫీ దిగారు. అనంతరం పూర్ణా మార్కెట్, దుర్గాలమ్మ గుడి, జగదాంబ కూడలి మీదుగా పార్టీ జిల్లా కార్యాలయానికి బస్సు యాత్ర చేరింది. సాయంత్రం జగదాంబ జంక్షన్, కలెక్టరేట్, అక్కడ నుంచి ఫిషింగ్ హార్బర్ మీదుగా బస్సు యాత్ర సాగి పాత పోస్టాఫీస్ వద్దకు చేరింది.

నేరాలు ఘోరాలు

ఆసుపత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు బాలదేవ్,రామన్న

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని యండపల్లివలస ఎపిఆర్ బాలికల కళాశాలలో ఇంటర్ సెకెండియర్ విద్యార్థిని సాలేరు ప్రేసిల్ల (17) గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే... .కొయ్యూరు మండలం కాకరపాడు గ్రామానికి చెందిన విద్యార్థినివేసవి సెలవులు తర్వాత 28న కళాశాలకు వచ్చింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ టెస్ట్ పరీక్షలు తప్పకుండా రాయాలని అధ్యాపకులు బలవంతం చేయడంతో, తాను లేటుగా వచ్చానని,పాఠం వినకుండా పరీక్షలు ఎలా రాస్తారని విద్యార్థిని చెప్పినప్పటికీ, లెక్చర్లు వినకుండా పరీక్షలు రాయాలని లేకపోతే పనిష్మెంట్ ఉంటుందని విద్యార్థిని బెదిరించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని విద్యార్థులు తెలిపారు. బాలికను అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చేర్చించి వైద్యసేవలు అందిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని విషయం తెలుసుకున్న ఎపి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి పి రామన్న అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాలేబు ప్రేసిల్ల (17) ను పరామర్శించారు. సరైన వైద్యం అందించాలని కోరారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేలా ఒత్తిడి చేసిన అధ్యాపకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని ఆరోగ్యం పట్ల కళాశాల యజమాన్యం ప్రిన్సిపాల్, వార్డెన్ కనీసం బాధ్యత లేకుండా వ్యవహరించారని ఆరోపించారు సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు డిమాండ్ చేశారు.

థాయిలాండ్ యువతులపై దాడి కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : థాయిలాండ్‌కు చెందిన యువతులతో గుట్టు చప్పుడు కాకుండా ఓ హోటల్‌లో వ్యభిచారం చేయిస్తూ మాట వినలేదని ఇద్దరు థాయిలాండ్ యువతులపై దాడి చేసిన కేసులో సూత్రదారి అయిన మహేష్‌ను ఆరిలోవ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 7న పాతడైరీఫారం, ఆదర్శనగర్‌లో ఆరంజ్ ఇన్ హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఇద్దరు థాయిలాండ్‌కు చెందిన ఇద్దరు యువతులు, అరుకు ప్రాంతానికి చెందిన మరో యువతితో వ్యభిచారం చేయిస్తూ, అడ్డుతగలిన థాయిలాండ్ యువతుల పాస్‌పోర్టు తీసుకొని, వారిపై చేయిచేసుకున్న మహేష్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న మహేష్‌ను గురువారం ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : మండలంలో సర్వసిద్ధి రాయవరం గ్రామదేవతల పండగలు ఘనంగా జరిగాయి రాయవరంలో బంగారం తల్లి పండుగ, సర్వస్థితి గ్రామంలో సిద్దేశ్వరమ్మ తల్లి పండుగ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పించారు. సర్వసిద్ధి గ్రామంలో కోలాటాలతో అమ్మవారిని ఊరేగించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు

మాట్లాడుతున్న నాయకులు

కోయ భాష, బాల సాహిత్యం రక్షణకు కృషి

ప్రజాశక్తి - చింతూరు : కోయభాష, బాల సాహిత్యాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు చోడి మురళి అన్నారు. మండల కేంద్రంలోని ఏపీఆర్ స్కూల్లో గురువారం జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ జులై 21న కోయ భాష దినోత్సవం గ్రామ గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. భావితరాలకు వారసత్వంగా బాల సాహిత్యాన్ని అందించాలని కోరారు. బాల సాహిత్యాన్ని రక్షించుకోవడం కోసం వివిధ పాఠశాలలో కోయ భాషలో పద్యాలు, పాటలు, సామెతలు, పొడుపు కథలపై పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కోయ బాల సాహిత్యం రక్షణ కోసం వివిధ ఆదివాసీ ఉద్యోగ సంఘాలు మేధావులు యువతీ, యవకులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కోయ భాషను దాదాపుగా ఎనిమిది రాష్ట్రాల్లో 4 కోట్ల మంది మాట్లాడతారని, కావున దీనికి జాతీయ భాషగా గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదు షెడ్యూల్ ఏరియాలో ఆదిమ తెగల విద్యార్థులకు వారి మాతృ భాషలోనే బోధన జరగాలన్నారు. ఈ సమావేశంలో కారం రాము, శేఖర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజశక్తి - రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పంచాయతీ జమ్మిసావిడి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన వేమా పార్వతి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, వీఆర్వో నానాజీ, కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేష్ తదితరులు గురువారం పరామర్శించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకుని ఆమెకి ప్రభుత్వం తరుపున వీఆర్వో నానాజీ తక్షణ సహాయం కింద బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. మండల కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుండి మరింత ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లవుడు బాబురావు, పొట్ట బోయిన వెంకట్రావు, అరపురెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రంలోని రేఖపల్లి గ్రామ సచివాలయం వీధిలో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ పూనెం సరోజినీ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులు నుండి ఈ సిమెంట్ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రజలు వర్షాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జెడ్‌పి నిధులు మంజూరైన రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపిటిసి బంధం విజయ లక్ష్మి, రేఖపల్లి సెక్రటరీ శివ ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు ఎండి.రహీం, ముత్యాల చంద్రశేఖర్, ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, టిడిపి రంపచోడవరం వాణిజ్య విభాగం అధ్యక్షులు బీరక సూర్య ప్రకాశరావు, బొర్రా నరేష్ కుమార్, జి వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

టిడిఆర్ వద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మెయిన్ రోడ్డు విస్తరణలో నిర్మాణాలు కోల్పోతున్న తమకు కోల్పోయిన మేరకు నష్టపరిహారంగా జివిఎంసి టిడిఆర్ ఇస్తోందని, ఇది తమకు ఆమోదయోగ్యం కాదని బంగారం వర్తక సంఘం అధ్యక్షుడు మారోజు శ్రీనివాస్ అన్నారు. గురువారం టౌన్ కొత్త రోడ్డు జంక్షన్‌లో బంగారు వర్తకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిఆర్‌ను తాము వేరొకరికి అమ్ముకుంటే.. అందులో పేర్కొన్న విలువ కంటే సగం కూడా రాదన్నారు.